రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

సిరికొండ, జనవరి 7: రైతాంగ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. మండలంలోని తాళ్లరామడుగులో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, వరి పంటకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, పంటలకు మద్దతు ధర చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బాకారం గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊషన్న, దత్తాద్రి, రాజన్న పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నగర కమిటీ ఎన్నిక

ఖలీల్‌వాడి, జనవరి 7: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగర కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బురుగుల వినోద్, పట్టణ అధ్యక్షుడిగా ధాత్రిక రతన్, ఉపాధ్యక్షులుగా కరిపె గుండాజి శ్రీనివాస పద్మ, సుభాష్, సెక్రటరీగా నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్, మోతి రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోటేశ్‌కు నియామకపత్రాలను అందజేశారు. దడ్వాయి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పోతనకర్ లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు కేంపుల నాగరాజు, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు రేవంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, సందీకర్ పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల..

ఖలీల్‌వాడి, జనవరి 7: తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. బీసీ సెల్ పట్టణ కన్వీనర్‌గా లవంగ రాజు, ఎస్సీ సెల్ కన్వీనర్‌గా అశోక్, టీఎస్‌టీయూసీ కన్వీనర్‌గా గంగా సాగర్, తెలుగు యువత కన్వీనర్‌గా రమేశ్ గౌడ్, తెలుగు రైతు కన్వీనర్‌గా సల్ల సత్యనారాయణ, తెలుగు మహిళా కన్వీనర్‌గా లక్ష్మీయాదవ్, మైనార్టీ సెల్ కన్వీనర్‌గా సలీంబాయ్‌ని ఎన్నుకున్నారు. పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రెంజర్ల సురేశ్, సీనియర్ నాయకులు రఫీక్‌ఖాన్, రాజేశ్వర్ గుప్తా, మల్లారెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

జక్రాన్‌పల్లి, జనవరి 7 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జశ్వంత్ కుటుంబానికి బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రవికాంత్ నిత్యావసర వస్తువులు వితరణ చేశారు. జశ్వంత్ తండ్రి సాయన్న ఆకస్మిక మరణంతో కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం ఐదు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేసింది. కార్యక్రమంలో సర్పంచ్ లతాదేవరాజ్, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, బ్రిలియంట్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జక్రాన్‌పల్లి, జనవరి 7: మండల కేంద్రంలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో దక్షిణ ఇండియా మెదక్ అధ్యక్ష మండలం క్యాలెండర్‌ను పాస్టర్ శశిప్రకాశ్ ఆదివారం ఆవిష్కరించారు. మెదక్ చర్చి అధ్యక్ష మండలం ఏర్పడి వందేండ్లు అవుతున్నదని తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యశోబుద్ధ క్యాలెండర్..

మండలంలోని వివేక్‌నగర్ తండాలో యశోబుద్ధ క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. బహుజనవాదులు విజయ్, గొట్టి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే ఆత్మసంతృప్తి

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావు

మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బాబూరావు

ఇందల్వాయి, జనవరి 7: జీవితంలో ఇతరులకు సేవచేయడంలో ఉన్న ఆనందం మరొకటి లేదని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావు అన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. లయన్స్ వైటల్ క్రియేటివిటీ రీజియన్ మీట్ కార్యక్రమం ఆదివారం డిచ్‌పల్లి మండలం బర్దీపూర్ శివారులోని అమృతా గార్డెన్‌లో అట్టహాసంగా నిర్వహించారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన లయన్స్ క్లబ్‌లు చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా లయన్స్ రీజియన్ చైర్మన్ శంకర్ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సేవా కార్యక్రమాలతో ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. కొవిడ్ సమయంలో లయన్స్ క్లబ్‌లు నిరుపమాన సేవలందించాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సేవాభావాన్ని అలవర్చాలన్నారు. పిల్లల పుట్టినరోజు నాడు వారితో సేవా కార్యక్రమాలు చేయించాలని ఉద్బోధించారు. పిల్లలు మత్తుపదార్థాల వైపు వెళ్లకుండా దృష్టి పెట్టాలని, వారిలో దేశభక్తి భావాలు పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ రీజియన్ చైర్మన్ మేడికొండ శంకర్, రీజియన్ కార్యదర్శి ద్వారకాదాస్ అగర్వాల్, జిల్లా గవర్నర్ పి.లక్ష్మి, ఉప గవర్నర్లు నాగేశ్, పంపటి అమర్‌నాథ్ రావు, పూర్వ గవర్నర్లు బీవీ బన్నల్, పెంటయ్య, గంప రమేశ్, బస వేశ్వర్‌రావు, వీరేశం గంధాని శ్రీనివాస్, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, జీఆర్ సూర్యరాజ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కోశాధికారి కోడాలి కిశోర్, కోశాధికారి ధర్మరాజు, లయన్స్ ప్రతినిధులు పి.లక్ష్మీ నారాయణ, డి.యాదగిరి, కరిపె రవీందర్, చింతల గంగదాస్ పాల్గొన్నారు.

ఆలయ దర్శనం సర్వ పాపహరణం

నిజామాబాద్ కల్చరల్, జనవరి 7: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ఆలయాలకు విశేష ప్రాముఖ్యత ఉన్నదని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. గణేశ్‌చౌక్ శుభం కరోతి మంగళం ఆలయ ప్రాంగణంలో ఆదివారం భక్తులకు అనుగ్రహభాషణం చేసి మాట్లాడారు. చిన్నతనం నుంచే ఆలయాలను దర్శించుకోవడంతో దైవభక్తి, దేశభక్తి, ఆత్మవిశ్వాసంతోపాటు చక్కని ఆలోచనలతో చదువులో బాగా రాణిస్తారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రతిరోజూ దేవాలయానికి వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో రాజుకుమార్ సుబేదార్, యుగేందర్, బాలశ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రుద్రూర్, జనవరి 7: కోటగిరి మండలంలోని సుద్దులం, కొత్తపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో మారుతి, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సూపర్‌వైజర్ మణి, కార్యదర్శి కవిత, స్వప్న, గిర్దావర్ సయ్యద్ హుస్సేన్, సర్పంచులు సాయిలు, గడ్డం భారతి, కమల పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ ముమ్మరం

ధర్పల్లి, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీ ముమ్మరంగా సాగుతున్నదని ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆపరేటర్లతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా 13,089 దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఈనెల 17వరకు డాటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున ఆదివారం సైతం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపట్టామన్నారు. కార్యక్రమంలో మండల కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండాలి

మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ వేదిక ప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, జనవరి 7: బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉంటూ విద్యా, వైద్య తదితర సేవలను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి బాలశ్రీనివాస్ అన్నారు. రైల్వేస్టేషన్ రోడ్‌లోని అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి గీతాభవనంలో ఆరోగ్య సేవలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుంటూ బ్రాహ్మ ణ సంక్షేమ వేదిక రూపొందించిన వి ద్యా, వైద్య, ఉపాధి సేవలను సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఉమ్మ డి జిల్లాలో ఏడు కార్పొరేట్ దవాఖానల్లో వివిధ వైద్య చికిత్సలపై రాయితీ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎస్‌వీ సంయుక్త కార్యదర్శి నేరెళ్ల మల్లికార్జున శర్మ, సకేశ్ శర్మ, యుగేందర్, వెంకట్‌రావు, బి.శ్రీనివాస్, పిట్లసుభాష్, రొట్టొ సురేశ్, రాజ్‌కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ ధార్మికవేత్త పద్మనాభ శాస్త్రికి వైద్య ఖర్చుల కోసం రూ.5వేల చెక్కును బ్రాహ్మణ సంక్షేమ వేదిక ప్రతినిధులు అందజేశారు.

తెలంగాణ భవన్‌లో ఆదివారం జహీరాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డితో పాటు చందూర్, మోస్రా మండల నాయకులు పాల్గొన్నారు.

– మోస్రా, జనవరి7

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్

నిజామాబాద్ క్రైం, జనవరి 7: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లారం అటవీ ప్రాంతంలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ తన కార్యాలయంలో సౌత్ రూరల్ సీఐ వి.వెంకటనారాయణ, రూరల్ ఎస్సై జి.మహేశ్‌తో కలిసి ఆదివారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి కుడి చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా ఇంద్రాపూర్ కాలనీకి చెందిన గర్డ్కర్ సయాజీ(35)గా నిర్ధారించి కేసు దర్యాప్తు చేపట్టారు. సయాజీ తరచూ మద్యం సేవించి భార్య అశ్వినిని వేధించేవాడు. ఈ క్రమంలో అశ్వినికి తన మేనత్త కొడుకు అయిన రామ్ జింజోర్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నెల 3వ తేదీన సయాజీ తాగి వచ్చి అశ్వినిని కొట్టి ఇంట్లోంచి బయటికి వచ్చేశాడు. దీంతో ఆగ్రహించిన అశ్విని విషయాన్ని ప్రియుడు రామ్ జింజోర్‌కు తెలిపి.. భర్తను ఎలాగైనా అడ్డుతొలగించాలని ప్లాన్ వేశారు. ఇందులో భాగంగా రామ్ జింజోర్, సయాజీ ఇద్దరు కలిసి మల్లారం అటవీ ప్రాంతానికి వచ్చి మద్యం సేవించారు. అనంతరం రామ్ జింజోర్ తన వెంట తీసుకువచ్చిన కత్తితో సయాజీ గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయి వచ్చి విషయాన్ని అశ్వినికి చెప్పాడు. ఘటనపై సౌత్ రూరల్ సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మహేశ్ తన బృందంతో కలిసి దర్యాప్తు నిర్వహించారు. హత్య కేసులో అశ్విని, రామ్ జింజోర్‌ను అరెస్టు చేసి వారి వద్ద హత్యకు వినియోగించిన కత్తి,రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని అభినందించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

బోధన్ రూరల్, జనవరి 7: ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం నగదును జమ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మయ్యగారి సంజీవ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో గతేడాది రైతుల ఖాతాల్లో ఈ సమయానికి రైతు బంధు సాయం జమ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9, 11 తేదీల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు రెండు ఎకరాల వరకు రైతు బంధు పడిందని పేర్కొన్నారు. మిగతావి కూడా త్వరగా జమచేయాలని పేర్కొన్నారు.

ప్రజాపాలనలో 11,297 దరఖాస్తులు

రెంజల్, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం గత నెల 28 నుంచి ఈనెల 6 వరకు గ్రామాల వారీగా నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా మండలంలో ఆరు గ్యారంటీల దరఖాస్తులు 11,297, రేషన్ కార్డు కోసం 3,656 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన గ్రామసభలో అభయహస్తం, కొత్త రేషన్‌కార్డు, పేర్లు నమోదు కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కేంద్రంలో ఆదివారం నాటికి 730 దరాఖాస్తులను నమోదు చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్..

మాక్లూర్, జనవరి7: మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజాపాలన గ్రామ సభల దరఖాస్తులను ఆదివారం నుంచి ఆన్‌లైన్ నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో జైక్రాంతి తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో 11700 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. సుమారుగా 40 మంది ఆపరేటర్లతో ఆన్‌లైన్ నమోదు పక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

రెంజల్, జనవరి 7: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లోలపు రజిని అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, విండో చైర్మన్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

భర్త ఆచూకీ తెలియడంలేని మహిళ ఆత్మహత్య

ఎడపల్లి, జనవరి 7: తప్పిపోయిన భర్త ఆచూకీ తెలియడం లేదని మనస్తాపానికి గురైన మంగళ్‌పాడ్‌కు చెంది ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రం ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. గ్రామానికి చెందిన మదారి నర్సవ్వ(47) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆమె భర్త భూమయ్య మూడున్నరేండ్ల క్రితం తప్పిపోయాడు. ఆయన ఆచూకీ తెలియకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఆదివారం గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

భర్త ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహిస్తున్న మహిళ

ఆర్మూర్‌టౌన్, జనవరి7: భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా మరో వివాహం చేసుకున్న భర్తపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామానికి చెందిన కావ్య ఆందోళన చేపట్టింది. ఫత్తేపూర్‌లోని భర్త ఇంటి ఎదుట ఇద్దరు పిల్లలతో ఆదివారం ఆందోళనకు దిగింది. బాధితురాలి కథనం మేరకు.. ఫత్తేపూర్‌కు చెందిన గంగాధర్‌కు బాల్కొండకు చెందిన కావ్యతో ఏడేండ్ల క్రితం వివాహం అయ్యింది. ఇద్దరి మధ్య గొడవల కారణంగా కావ్య తల్లిగారింటి వద్ద ఉంటోంది. గొడవకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. గంగాధర్ 15 రోజుల క్రితం రెండో పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కావ్య గంగాధర్ ఇంటి ఎదుట ఇద్దరు పిల్లలతో ఆందోళన చేసింది. తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేసింది.

కులస్తుల అభ్యున్నతికి కృషి చేయాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కుల సంఘం ప్రతినిధులు

బోధన్, జనవరి 7: బోధన్ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని మున్నూరు కాపు కులస్తులు ఐక్యంగా ఉంటూ కులస్తుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆసంఘం ప్రతినిధులు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌లో మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ మాజీ ఎంపీపీ గంగాశంకర్, శ్రీ చక్రేశ్వర శివమందిరం చైర్మన్ బీర్కూర్ శంకర్ (బుజ్జి), బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్ కుమార్, ఎడపల్లి ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. పార్టీలు ఏవైనా రాజకీయాలకు అతీతంగా కుల సంఘం అభివృద్ధికి, కులస్తుల అభ్యున్నతికి కృషిచేద్దామని వారు అన్నారు. మండలాలు, నియోజకవర్గ స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందిద్దామని పేర్కొన్నారు. అనంతరం వివిధ హోదాల్లో ఉన్న కుల పెద్దలను సన్మానించారు. అనంతరం మున్నూరు కాపు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఘనంగా మల్లన్న జాతర

వెల్మల్‌లో భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మల్లన్న ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

నందిపేట్, జనవరి 7: మండలంలోని వెల్మల్ గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వెల్మల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. సోమవారం ప్రత్యేక పూజాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఠానాకలాన్ గ్రామంలో..

ఎడపల్లి, జనవరి7: ఠానాకలాన్ గ్రామంలో మల్లన్న పండుగను ఘనంగా నిర్వహించారు. గొల్ల, కురుమలు, గ్రామస్తులు మల్లన్నకు నైవేద్యాలు సమర్పించారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించి ఆలయ పరిసరాల్లో వంటలు వండుకొని భోజనాలు చేశారు.

కొనసాగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం

శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

మెండోరా(ముప్కాల్)జనవరి7: మెండోరా మండలంలోని బుస్సాపూర్‌లో రెండు రోజులుగా బాల బాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం తెలిపారు. 20 ఏండ్ల విభాగంలో మహిళలు, పురుషులకు నిష్ణాతులతో కబడ్డీలో మెలుకువలు నేర్పుతున్నట్లు నిర్వాహకులు వివరించారు. ఈ శిక్షణ ఈనెల 9 వరకు కొనసాగుతుందని వివరించారు. రాష్ట్రస్థాయిలో పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపీపీ బురుకల సుకన్యా కమలాకర్, నిజమాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యుడు కబడ్డీ గంగాధర్ శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు.

పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కమ్మర్‌పల్లిలో క్రికెట్ టోర్నీ

కమ్మర్‌పల్లి,జనవరి 7: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో గ్రీన్‌ఫీల్డ్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించిన క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. 16 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు అందజేయనున్నారు.

పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

భూమిపూజ చేస్తున్న వైస్ ఎంపీపీ యోగేశ్

రెంజల్, జనవరి 7: నీలాలో సంఘ భవనాల ప్రహరీ నిర్మాణ పనులకు ఆదివారం వైస్ ఎంపీపీ క్యాతం యోగేశ్ భూమిపూజ చేశారు. ఎంపీ నిధులు రూ. 8లక్షల వ్యయంతో ముదిరాజ్, యాదవ్ సంఘ భవనాల ప్రహరీ నిర్మాణానికి మంజూరైన పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించి, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మార నాగభూషణం పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నవీపేట, జనవరి 7: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ సూచించారు. ఆదివారం మండంలోని తుంగినీ, నిజాంపూర్ గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ఆర్‌జీ, ముద్ర రుణాలు తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ మోహన్, వైద్యులు సామ్రాట్, తుంగినీ, నిజాంపూర్ సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం

ముప్కాల్, జనవరి 7: పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కార్యదర్శి దయానంద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్రహ్మదండి చిన్నయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా దాసరి నరేశ్, జాయింట్ సెక్రటరీగా చిలుక నర్సయ్య, క్యాషియర్‌గా జోగు త్రిమూర్తి, సభ్యులుగా హరీన్, ఆనంద్, పోశెట్టి, పెంటు గంగాధర్, సలహాదారులుగా దాసరి నర్సింగ్‌దాస్, లింగం, జోగు నర్సయ్య పాల్గొన్నారు.

బొర్ర హనుమాన్ యువజన సంఘం అధ్యక్షుడిగా తరుణ్

భీమ్‌గల్, జనవరి 7: బొర్ర హనుమాన్ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా బొదిరె తరుణ్ ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నరేశ్, కోశాధికారిగా బొదిరె లక్ష్మణ్, సలహాదారుడిగా బొదిరె చరణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నీలం రవి, బొదిరె నరేశ్, గంగం నరేశ్, బొదిరె లింబాద్రి, రావుట్ల హరీశ్, గంగారపు రవి పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర

బోధన్/శక్కర్‌నగర్/రెంజల్, జనవరి 7: అయోధ్య పూజిత అక్షింతలను ఆదివారం బోధన్ పట్టణంలోని జంగంగల్లీకి చెందిన పలువురు ప్రముఖులు శక్కర్‌నగర్‌లోని శ్రీరామ మందిరం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ అక్షింతలను కాలనీలో పంపిణీ చేశారు.

బీటీ నగర్‌లో అక్షింతల పంపిణీ

బోధన్‌లోని బీటీ నగర్‌లో అయోధ్య అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. మొదట స్థానిక కోట మైసమ్మ సహిత లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ వ్యవస్థాపకుడు పసులేటి గోపి కిషన్ ఆధ్వర్యంలో వీటిని శక్కర్‌నగర్‌లోని రామాలయం నుంచి తెచ్చి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

కళ్యాపూర్‌లో..

రెంజల్ మండలంలోని కళ్యాపూర్‌కు చేరుకున్న అయోధ్య పూజిత అక్షింతలను పల్లకీపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ అంక్షింతలు పంపిణీ చేశారు.

శక్కర్‌నగర్‌లోని శ్రీరామ మందిరం నుంచి అక్షింతలను తీసుకెళ్తున్న జంగంగల్లీ కాలనీవాసులు

కళ్యాపూర్ గ్రామంలో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.

NT-319407-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలక